క్లుప్తంగా

రాజ్‌గోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని పూజలు



కొండగట్టులో కొబ్బరికాయలు కొడుతున్న మెండు భాస్కర్‌రెడ్డి తదితరులు

రాజాపేట : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని కోరుతూ మండలంలోని బసంతపురం గ్రామానికి చెందిన కోమటిరెడ్డి యువసేనా రాష్ట్ర అధ్యక్షుడు మెండు భాస్కర్‌రెడ్డి శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన 101కొబ్బరికాయలు కొట్టారు. ఆయన వెంట నాయకులు ఉదయ్, హరినాథ్‌రెడ్డి, రాము, గోపాల్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, శివ, నవీన్, మహేశ్వర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ విద్యార్థి జిల్లా అధ్యక్షుడిగా కుశలవకుమార్



కుశలవకుమార్

మోత్కూరు : మున్సిపల్ కేంద్రానికి చెందిన తాటిపాముల కుశలవకుమార్ తెలంగాణ విద్యార్థి, యువజన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కుశలవకుమార్ తెలిపారు. దళిత బహుజన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించినందుకు తన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా నియామకం చేసిన రాష్ట్ర అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ చామలను కలిసిన సూర్యనారాయణరెడ్డి



ఎంపీని సన్మానిస్తున్న సూర్యనారాయణరెడ్డి

భువనగిరి : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం డిగ్రీ, పీజీ విద్యార్థులకు సంబంధించిన ఫీజురియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీని కోరినట్లు తెలిపారు.

బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

చౌటుప్పల్ : బ్లాస్టింగ్‌తో బండరాళ్లు తమ వ్యవసాయ భూమిలో పడుతున్నాయని, బ్లాస్టింగ్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు చెరుకు ధనమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వేనంబర్ 668లో ధనమ్మకు 4.30ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో పంటలు సాగు చేసుకుంటుంది. సమీపంలో ఉన్న ఎపిటోమ్ రియల్ ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాస్టింగ్ చేయడంతో రాళ్లు తమపొలంలో పడ్డాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట : మండల కేంద్రానికి చెందిన మేడి శంకరయ్య, వి.నరసింహలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.31,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తాజామాజీ ఎంపీటీసీ వనం హర్షిణీచంద్రశేఖర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దీన్, వనం నర్సింహా, గొరిగె శేఖర్, గొలుసుల ప్రసాద్, ఎండీ ఖరీం, సైదాచారి, మహేష్, కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మద్దెల సాయిగౌడ్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకుడు తొర్ర విష్ణు శనివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, శ్రీసాయి సేవా సమితి అధ్యక్షురాలు బీసు ధనలక్ష్మి, సినీ హీరో బీసు రణధీర్‌గౌడ్ ఉన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం కలేనా?

- గుంతలమయంగా మారిన మోదుబావిగూడెం వెళ్లే రోడ్డు
- గత సంవత్సరం బీటీ నిర్మాణానికి మంజూరైన నిధులు
- నేటికీ ప్రారంభంకాని టెండర్ల ప్రక్రియ
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



గుంతలమయంగా మారిన మోదుబావిగూడెం వెళ్లే రోడ్డు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని మోదుబావిగూడెం గ్రామపంచాయతీగా ఏర్పడి సుమారు 40సంవత్సరాలు కావస్తున్నా నేటికి ఆ గ్రామానికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. ఈ మట్టిరోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణించాలంటే గ్రామస్తులకు నరకప్రాయంగా మారుతుంది. గ్రామంలో సుమారు 800వరకు జనాభా ఉంటుంది. ఈ గ్రామం నుంచి ప్రజలు మోత్కూరు, ఆత్మకూరు(ఎం) మండల కేంద్రాలకు పనుల నిమిత్తం ఎక్కువగా వెళ్తుంటారు. ఈ గ్రామం నుంచి 5కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తే కప్రాయపల్లి స్టేజీ వద్ద బస్సు సౌకర్యం ఉంటుంది. ఈ గ్రామానికి మట్టిరోడ్డు ఉండడంతో ఆటోలు, బస్సులు వచ్చే పరిస్థితిలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది.

గత సంవత్సరం మంజూరైన నిధులు..

గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కప్రాయపల్లి నుంచి వయా మోదుబావిగూడెం మీదుగా ఉప్పలపహాడ్ వరకు బీటీరోడ్డు నిర్మాణం కోసం రూ.5.50కోట్ల నిధులు మంజూరు చేసింది. తేది: 11.08.2023న జీఓ నంబర్ 359 ద్వారా నిధులు మంజూరు చేశారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శిలాఫలకం వేశారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు.

మొదలుకాని టెండర్ల ప్రక్రియ..

కప్రాయపల్లి నుంచి మోదుబావిగూడెం మీదుగా ఉప్పలపహాడ్ వరకు నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డుకు ప్రభుత్వం ఇంత వరకు టెండర్లను పిలువలేదు. ప్రభుత్వం మారడంతో రోడ్డు నిర్మాణం కోసం మంజూరైన నిధులు వాపస్ పోయినట్లుగా పలువురు భావిస్తున్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ హయాంలో కూడా బీటీ నిర్మాణం కోసం నిధులు మంజూరు అయినప్పటికీ పనులు ప్రారంభంకాలేదు. రెండు సార్లు నిధులు మంజూరు చేసినట్లు చెబుతున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి



కప్రాయపల్లి నుంచి మోదుబావిగూడెం వయా ఉప్పలపహాడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారులు స్పందించి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలి.

– బబ్బూరి రమేష్, మోదుబావిగూడెం

గ్రామానికి బీటీ రోడ్డు చూడాలని కోరిక



గ్రామస్తులు సహకారంతో ఎన్నో పోరాటాల ద్వారా రోడ్డు నిర్మాణం కోసం పాలకులతో కొట్లాడి నిధులు మంజూరు చేయించుకున్నాం. మంజూరైన నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేయడంలో జాప్యం చేస్తున్నారు. గ్రామానికి బీటీరోడ్డు చూడాలన్నదే మా గ్రామస్తుల కోరిక. బీటీ రోడ్డు నిర్మాణం చేస్తే గ్రామం అభివృద్ధి చెందుతుంది. అధికారులు త్వరంగా పనులు ప్రారంభించాలి.

– బబ్బూరి మాధవి, తాజా మాజీ సర్పంచ్

టెండర్లలో జాప్యం జరుగుతుంది

మోదుబావిగూడెం రోడ్డు మంజూరు ప్రస్తుతం టెక్నికల్ శాంక్షన్ స్టేజీలో ఉంది. ప్రతిపాదనలను ఈఎంసీ కార్యాలయానికి పంపడం జరిగింది. మంజూరైన నిధులు వాపస్ పోలేదు. ప్రస్తుతం శాంక్షన్‌లో ఉంది. టెక్నికల్ శాంక్షన్ మంజూరైన అనంతరం టెండర్‌లు పిలిచే అవకాశం ఉంటుంది. టెండర్‌ల పక్రియ జాప్యం జరుగుతుందనే మాట వాస్తవం.

– హేమంత్, డీఈ పీఆర్

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రాజాపేట : కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం మండలంలో బీఆర్‌ఎస్ నుంచి పలువురు ముఖ్యనాయకులు ఎమ్మెల్యే అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అర్కాల గాల్‌రెడ్డి, మోత్కుపల్లి ప్రవీణ్, పాండవుల భానుప్రకాష్‌గౌడ్, గొల్లపల్లి రాంరెడ్డి, కాయితి శ్రీనివాస్‌రెడ్డి, రేగు సిద్దులు, నక్కీర్త కనకరాజు, జంపయ్యతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే అయిలయ్య బొందుగుల గ్రామంలో సీసీరోడ్డు పనులు, చర్చి భవన నిర్మాణానిక శంకుస్థాపన చేశారు. అదే విధంగా 90మంది విద్యార్థులకు మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి 20కేజీ బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సరేందర్‌రెడ్డి, నాయకులు పెంటయ్య గౌడ్, నరేష్, లక్ష్మారెడ్డి, బాలయ్య, శ్రీశైలం, బాలమల్లేష్, వీరయ్య, నర్సింహులు, సురేందర్, నవీన్, లవన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

యాదగిరిగుట్ట : గ్రామ రెవెన్యూ అధికారులను తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకునేలా చూడాలని కోరుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు శనివారం వీఆర్‌ఓలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విప్ ఐలయ్య మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో వీఆర్‌ఓల సమస్యలపై మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు శ్రీశైలం, వెంకటేష్, బోళ్ల శేఖర్, నర్సింహారెడ్డి, స్వామి, రమేష్, శ్రీనివాస్, చారి, బాలయ్య, శేఖర్, యాదగిరి, రంజాన్, శంకర్, కే.శంకర్, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

మోడ్రన్ ధోబీఘాట్‌లను నిర్మించాలి

బొమ్మలరామారం : ప్రతి గ్రామంలో మోడ్రన్ ధోబీఘాట్‌లను నిర్మించాలని రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ కోరారు. మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన మండల రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల వృత్తి ఆదరణ కోల్పోతున్న నేపథ్యంలో కులస్తులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు ఎడిజర్ల భూపాల్, జూపల్లి భరత్, బాలకృష్ణ, మహేష్, అనిల్, జంగయ్య, గణేష్, లింగయ్య, పాపులు, భూములు, నగేష్ పాల్గొన్నారు.

వెల్లంకిలో సోలార్ వెలుగులు

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామాన్ని ఎల్‌ఐసీ చౌటుప్పల్ బ్రాంచ్ వారు జీవిత బీమా గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు వల్లందాసు క్రిష్ణమూర్తి చొరవతో ఎల్‌ఐసీ వారు సామాజిక సేవలో భాగంగా గ్రామానికి రూ.లక్ష విలువగల నాలుగు సోలార్‌లైట్లను మంజూరు చేశారు. దీంతో శనివారం వాటిని గ్రామ పంచాయతీ, మాధవరెడ్డి చౌరస్తా, ఇంద్రపాలనగరం, పెద్దకాపర్తి చౌరస్తాలలో బిగించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రామన్నపేట : రామన్నపేట లయన్స్ క్లబ్ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా బాధ్యుడు రేపాల మదన్‌మోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రామన్నపేట లయన్స్‌క్లబ్ 21వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గుర్రం ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శిగా బోయ గాలయ్య, కోశాధికారిగా పనకంటి భాస్కర్‌రావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ.. క్లబ్ తన సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. అనంతరం డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సిరిగిరెడ్డి సంజీవరెడ్డి, కేవీ ప్రసాద్, శివశంకర్, మురళీధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, అనంతరెడ్డి, రాజలింగం, సంజీవరెడ్డి, యాపాల కృష్ణారెడ్డి, జినుకల ప్రభాకర్, తాటికొండ సూర్యనారాయణ, నూల సిద్ధప్ప, బొడ్డు వెంకటేశం, శంకరయ్య, బోగోజు గోవర్ధన్, గుత్తా నర్సిరెడ్డి, ఎడ్ల మహేందర్‌రెడ్డి, నూల పరమేశ్వర్ పాల్గొన్నారు.

మోత్కూర్‌లో వైద్యశిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మోత్కూరు : వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను ప్రతిఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మోత్కూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.హేమంత్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులను పరిసరాల పరిశుభ్రతతో నియంత్రించవచ్చని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లక్ష్మి, సీహెచ్‌ఓ దేవకి, సూపర్‌వైజర్లు కృష్ణ, ఊర్మిళ, ఏఎన్‌ఎం రాములమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలపై సీపీఎం పోరుబాట



చౌటుప్పల్ : గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాయకులు

చౌటుప్పల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని ధర్మోజిగూడెం, పంతంగి, అంకిరెడ్డిగూడెం గ్రామాల్లో సీపీఎం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గంగదేవి సైదులు, జిల్లా సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, నాయకులు గడ్డం వెంకటేశం, చీరిక సంజీవరెడ్డి, అలివేలు, అశోక్, శ్రీకాంత్, మహేష్ ఉన్నారు.

నాగులకుంట సందర్శన..

పట్టణ కేంద్రంలోని నాగులకుంటను సీపీఎం నాయకులు సందర్శించారు. తక్షణమే కుంటను సుందరీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బండారు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.పాష, నాయకులు బత్తుల దాసు, గోశిక కరుణాకర్, స్వామి, కృష్ణ, యాదయ్య, శ్రీనివాస్‌చారి, జయమ్మ, అనసూయ పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మించాలి

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామం నుంచి బుజిలాపురం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, సీనియర్ నాయకుడు పైళ్ల యాదిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం బుజిలాపురం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పట్టణ నాయకులు చింతల కృష్ణారెడ్డి, మాంద్ర చంద్రయ్య, మల్లయ్య, రాములు, కొంపల్లి గంగయ్య తదితరులున్నారు.

ముదిరాజులను బీసీ ఏలోకి మార్చాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వలిగొండ : తెలంగాణలో ముదిరాజులను బీసీ డి నుంచి బీసీఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొల్పుల హరినాథ్ ముదిరాజ్ అన్నారు. ఈనెల 15 నుంచి 20వతేదీ వరకు సమస్యలపై రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించాలని ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు నిధులు మంజూరు చేయాలని, చెరువులు కుంటలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలని, మత్స్యకారుల అభివృద్ధికి సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయాలని, 50సంవత్సరాలు నిండిన ప్రతి ముదిరాజుకు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బండి రవి, నిమ్మల రవి, నిమ్మల భిక్షం, నిమ్మల స్వామి, వేల్పుల కిష్టయ్య, సింగారం శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతిగృహం సందర్శన



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

భువనగిరి : పట్టణంలోని ఎస్సీబాలుర వసతిగృహాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు అన్ని రకాల సదుయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బుగ్గ దేవేందర్, జిల్లా ఇన్‌చార్జ్ మాస శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడి కోటేష్, శ్యామ్, నాయకులు నాగరాజు, రాము, కుమార్, నవీన్ పాల్గొన్నారు.

ఫొటోఫ్రెండ్ ఎక్స్‌పో పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : హైదరాబాద్‌లో ఈనెల 26, 27, 28తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ఫ్రెండ్ ఎక్స్‌పోను జయప్రదం చేయాలని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమిడి మాధవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రఫీలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. కాగా ఎక్స్‌పోలో పాల్గొన్న ప్రతి ఫొటోగ్రాఫర్‌కు ఫొటోపరివార్ కార్డు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు దోర్నాల గణేశ్, ఉపాధ్యక్షుడు సీత శ్రవన్, కేమ విష్ణుమూర్తి, కోశాధికారి రవ్వ నవీన్, సుంకరి నరేశ్, గుద్దేటి పాండు, వెంకటచారి, చెరుపల్లి గణేశ్, దొడ్డమోని వంశీధర్, వంగూరి నరేశ్‌కుమార్, పెండెం బాలలింగం, జంగయ్య పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆరుట్ల సుశీల

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణను ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇచ్చించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వ సహకారంతో కుట్టుమిషన్‌లు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సమిలె రాజ్యలక్ష్మీరాంచందర్, మాజీ ఎంపీటీసీ ఎర్ర పోచయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్, కళ్లెపల్లి మహేందర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ వీరేశం

ఆలేరురూరల్ : ఆలేరు ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజన్ పోరాట సాధన కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం అన్నారు. శనివారం పట్టణంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి రోజే రెవెన్యూ డివిజన్ కోసం సంతకం చేస్తానన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేటికి ఐదు నెలలు గడిచిన ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. సమావేశంలో కోకన్వీనర్ రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేష్, ఎండీ సలీం, మొరిగాడి చంద్రశేఖర్, కల్లపు అడివయ్య, కె.ఉప్పలయ్య, బాంబె రవి, సముద్రాల సత్యం, కామిటికారి అశోక్, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ : మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు మాట్లాడుతూ.. మండలంలో వ్యవసాయంపై ఆధారపడే రైతులు అధికంగా ఉన్నారని, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రం మండల కేంద్రంలో లేక రామన్నపేటకు వెళ్లాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేలాది రూపాయల అదనపు భారాన్ని భరించాల్సి వస్తుందని వెంటనే స్థానిక సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిర్పంగి స్వామి, బొల్లు యాదగిరి, చీర్క శ్రీశైలంరెడ్డి, మెరుగు వెంకటేశం, కొండే కిష్టయ్య, కందడి సత్తిరెడ్డి, సురేష్, లింగం పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

భువనగిరిటౌన్ : జిల్లాలో గత ప్రభుత్వాలు నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఇంటి స్థలాలు చూపించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భువనగిరి మండలం, పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి నివేషణ స్థలాలు కేటాయించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. పట్టణంలో 2000మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు లేవని, భువనగిరి సమీపంలో గల హన్మాపురం గ్రామంలో 76ఎకరాల ప్రభుత్వ భూమి నిరుపయోగంగా ఉందని ఆ భూముల్లో స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏషాల అశోక్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, మండల కార్యవర్గ సభ్యులు ఉడుత రాఘవులు, మరిపెల్లి రాములు, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, మండల కౌన్సిల్ సభ్యులు కోట శంకర్, నాగపురి యాదగిరి, బబ్బూరి అంజమ్మ, బింగి కృష్ణ, బద్దం వెంకటరెడ్డి, నరసయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టీడీపీ ఆవిర్భావంతోనే సమాజంలో మార్పులు

చౌటుప్పల్ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే సమాజంలో అనేక మార్పులు వచ్చాయని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ, మున్సిపల్ కమిటీలతో పాటు వివిధ అనుబంధ కమిటీల నూతన కార్యవర్గాల ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యకుడు కుందారపు కృష్ణమాచారి, రాష్ట్ర కార్యదర్శి రాపోలు నర్సింహ పాల్గొన్నారు.

నేతన్న కుటుంబానికి రూ.5లక్షలు చెల్లించాలి

మోత్కూరు : ఉపాధిలేక అప్పులపాలై నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు ఏలె శంకరయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం నర్సింహ, ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, పనులు లేక, పూటగడవక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్మికులకు పని కల్పించడంతో పాటు చేనేత సంక్షేమానికి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బూడిద రాజు తల్లి బూడిద సత్తమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సింహచారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్ గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కోరె భిక్షపతి తదితరులు శనివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబం కావడంతో పార్టీ ఆధ్వర్యంలో రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. వారిలో పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశంగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నోముల వెంకట్‌రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్య, నాయకులు కట్టెకోల హన్మంతు గౌడ్, తండ శ్రీశైలం ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన కోటగిరి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్ శనివారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మల్లాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గడసంతల నర్సింహులు కుటుంబానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో రూ.5వేల ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శిఖ అరవింద్‌గౌడ్, బుషోల్ల శ్రీనివాస్, కర్రె మధు, తోట లోహిత గౌడ్, ఉపేందర్, కిష్టయ్య ఉన్నారు.

భువనగిరి రూరల్ : మండలంలోని చందుపట్ల పీఏసీఎస్‌లో సభ్యుడిగా ఉన్న ఎర్రంబెల్లి గ్రామానికి చెందిన సైరెడ్డి కృష్ణారెడ్డి(65) ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబానికి సంఘం డివిడెండ్ ఫండ్ నుంచి శనివారం చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు పెద్దింటి మల్లారెడ్డి, సీఈఓ దంతూరి నర్సింహ, మొలుగు నర్సింహ, సభ్యులు పాల్గొన్నారు.